నేటి దినపత్రిక
# సూర్య

సోమవారం
19 ఫిబ్రవరి
2024
పేజీలు 8

అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్

## మందులోళ్లకు..
# డబ్బు జబ్బు



- మెడికల్ వ్యాపారుల దందా
- రోగులపై మోయలేని భారం
- కొనలేక లబోదిబో మంటున్న రోగులు
- సాధారణ మందుల ముసుగులో జనరిక్
- మోసపోతున్న కొనుగోలుదారులు

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపై మెడికల్ షాపులు ఉన్నాయి. ఈ షాపుల్లో విచ్చలవిడిగా మందుల అమ్మకాలు అడ్డగోలుగా ఔషధాల అమ్మకాలు సాగుతున్నా ఔషధ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు.జ్వరం వస్తే డోలో 650 వేసుకుంటే తగ్గిపోతుంది.. దీని ధర రూ.2లు.. అదే జ్వరం వచ్చిందని మెడికల్ షాపునకు వెళితే రూ.100కు తగ్గకుండా బాదేస్తారు.. జ్వరానికి వందఎందుకంటారా.. మరి వచ్చినకొనుగోలుదారుడిని రూ.2లతో వదిలేస్తారా.. ఎంతో కొంత రాబట్టవద్దు.. అదీ ఇదీ అని రూ.100పైనే బిల్లు చేస్తారు. ఆ మందులు వేసుకుంటే తగ్గక చస్తుందా.. ఎందుకంటే అందులో ఒకటి డోలో 650 ఉండనే ఉంటుంది. మరి మిగిలిన మందులెందుకంటారా అదే మెడికల్ షాపుల వ్యాపార రహస్యం......

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక
సూర్య బ్యూరో

2 లో

## క్లోరినేషన్ శాంపిల్స్
# పరీక్షించండి



# ప్రపంచాన్ని మార్చే..
## అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య

యువత విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కళాశాల రజితోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ప్రపంచ స్థితిగతులను మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల 1998లో 180 మంది విద్యార్థులతో ప్రారంభమై ఇప్పుడు 1400 మంది విద్యార్థులకు చేరుకోవటం కళాశాల వ్యవస్థాపకులు రామ శేషాద్రిరావు దూరదృష్టి అభినందనించదగిన అంశమని అన్నారు. కళాశాల గత 25 సంవత్సరాలలో భారత దేశం, విదేశాలలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, ప్రఖ్యాత ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలలో కీలక పదవులను నిర్వహించిన అనేక మంది పూర్వ విద్యార్థులను కళాశాల తయారు చేసిందని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. 25 సంవత్సరాల విద్యాసంస్థ చరిత్రలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని, ఇది దాని ప్రయాణంలో మొదటి పావు శతాబ్దాన్ని సూచిస్తుందన్నారు. ఈ సందర్భంలో విద్యా సంస్థ మూడు అంశాలను అవలోకనం చేసుకోవాలని చెబుతూ మొదటది 25 సంవత్సరాల మైలురాయిని చేరుకున్నందుకు గుర్తు చేసుకోవటం, రెండవది, ఇప్పటివరకు ప్రయాణించిన మార్గాన్ని ప్రతిబింబించడం, మూడవదిగా భవిష్యత్తు కోసం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవడం ముఖ్యమన్నారు. ప్రపంచాన్ని మార్చడానికి విద్యా సంస్థలు ఉపయోగించే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను ఆయన గుర్తు చేశారు. రజతోత్సవ వేడుకల చివరి రెండు రోజుల్లో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, ఇతర భాగస్వాములందరూ ఒకచోట చేరి, విద్యాసంస్థల 25 ఏళ్ల ప్రయాణాన్ని ఆత్మపరిశీలన చేసుకొని, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకున్నారని అన్నారు. ఈ కళాశాలకు ఇది తన మొదటి సందర్శన అని, కళాశాల విద్యా సంబంధ విజయాలు, తరగతి గది భవనాలు, క్రీడలు, హాస్టల్లోని సౌకర్యాలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న అత్యాధునిక మౌలిక సదుపాయాలు తనను అమితంగా

మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)




# ప్రపంచాన్ని మార్చే..

### అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య



ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. కళాశాల అభివృద్ధికి స్కిల్–ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ ల్యాబ్ ని స్థాపించడం, కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులను తాను అభినందిస్తున్నాను అన్నారు. 25 ఇయర్స్ ఆఫ్ శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ అనే పేరుతో కళాశాల సమగ్ర చరిత్రను ప్రదర్శించే పుస్తకాన్ని విడుదల చేయడంలో కళాశాల చొరవను అభినందిస్తున్నానన్నారు. ఈ పుస్తకం గ్రామీణ ప్రాంతంలో విద్యా సంస్థను స్థాపించడం, విద్యను పెంపొందించాలనే దృక్పథం, అభిరుచి, భావజాలాలు, దూరదృష్టి, అత్యాధునిక సౌకర్యాలతో ఇంజినీరింగ్ కళాశాలను నిర్మించడానికి దాని వ్యవస్థాపకులు సంవత్సరాలుగా చేస్తున్న నిరంతర కృషిని వెలుగులోకి తెస్తుందని అన్నారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ దంపతులకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, కళాశాల సొసైటీ చైర్మన్ డాక్టర్ వి.నాగేశ్వరరావు పుష్పగుచ్ఛాలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.



ప్రధాన భవనం వద్ద గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన సతీసమేతంగా సభా వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వల్లూరిపల్లి నాగేశ్వరరావు, కళాశాల సెక్రెటరీ వి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ బుర్ర కరుణ కుమార్, గుడివాడ ఆర్డిఓ పి పద్మావతి ఇతర అధికారులు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మందులోళ్లకు డబ్బు జబ్బు



### మెడికల్ వ్యాపారుల దందా

### రోగులపై మోయలేని భారం

### కొనలేక లబోది బో మంటున్న రోగులు

### సాధారణ మందుల ముసుగులో జనరిక్

### మోసపోతున్న కొనుగోలుదారులు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** జలుబు చేస్తే మాన్‌టెక్ ఎల్‌సీ, సెట్రోజన్.. ఈ రెండు రకాల టాబ్లెట్‌లు రూ.20లు..రోజులో ఉదయం ఒకటి.. సాయం త్రం ఒకటి చొప్పున రెండు రోజులు వేసుకుంటే.. జలుబు మ టుమాయం.. అంటే రెండు రోజులకు సుమారు రూ. 40లు ఖర్చు అవుతుంది. అదే మెడికల్ షాపునకు వెళ్లి చూడండి.. నాలుగు రకాలకు తగ్గకుండా మం దులు ఇచ్చేస్తారు. బిల్లు చూస్తే రూ.200లకు తగ్గదు. ఇలా ఏదైనా సరే మం దుల షాపునకు వెళ్లామా ఇక అంతే.. ఆ దోపిడీకి అంతే ఉండదు.. పావలా టాబ్లెట్‌ను ఏ మాత్రం బెరుకు.. భయం లేకుండా రూ.10లకు అమ్మేస్తారు.. ఎందుకంటే ప్రతి టాబ్లెట్‌పై ధర ఉండదు.. ధర ఉన్న టాబ్లెట్‌లు ఇవ్వరు. మొత్తం 10 టాబ్లెట్స్‌కు కలిపి ఒక చోటే ఎమ్మార్పీ ధర ఉంటుంది. ఆ ధర లేకుండా మందులు కట్ చేసి అమ్మేస్తారు. దీంతో కొనుగోలుదారుడికి అసలు ధర ఎంతనేది తెలియదు. ఏదోఇచ్చారు వేసుకున్నాం.. తగ్గింది కదా ఇక చాల్లే అని వదిలేస్తాడు. అసలు దోపిడీ అంతా ఇక్కడే జరుగుతోంది".

నేడు రోగి రోగంతో కాదు.. ముందులు కొనలేకచచ్చిపోతున్నాడు.. ఇదీ ఒక సీనియర్ డాక్టర్ చెప్పిన మాట..ఇది ముమ్మాటికి నిజం.. ఎందుకంటే మెడికల్ షాపుల మాయాజాలం అంతా ఇంతా కాదు.. రోగులను జలగల్లా పట్టి పీడించేస్తున్నారు.. ఏదైనా దీర్ఘకాలిక రోగం వచ్చిందా సామాన్యుడి బతుకు అంతే.. నెలవారీ చింతే.. మందులు కొనలేక.. మెడికల్ షాపు వద్ద బిల్లు కట్టలేకలబోదిబోమంటాడు.. మందు వేసేకోక పోతే ప్రాణాలు పోతాయ్.. అలాగని మందులు కొంటే ఇంట్లో గడవదు.. చివరకు చాలా మంది ప్రాణాలనే బలిపెడుతున్నారు". జిల్లాలోని గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి చోట కొంత మంది మెడికల్ షాపుల యజమానులు రోగులను అడ్డదారిన దోచేస్తు న్నారు. వాడే మందులపై అవగాహన లేక పోవడాన్ని మెడికల్ మాఫియా అలుసుగాతీసుకుంటుంది. దీం తో సామాన్యుల, మధ్య తర గతి నుంచి దోపిడీకితెగబడుతున్నారు. గుంటూరు, తెనాలి, పొన్నూరు , చిలకలూరిపేట, సత్తెనపల్లి. బాపట్ల పట్టణాలతో పాటు పలు గ్రామాలు, మండల కేంద్రాల పరిధిలోని మెడికల్ షాపుల యజమానులు కొందరు ప్రజల బలహీన తలను అడ్డం పెట్టుకుని మెడికల్ మాఫి యాగా విజృంభించారు. మెడికల్ షాపుల వ్యాపారం లాభసాటిగా ఉండ డంతో విచ్చల విడిగా వెలుస్తున్నాయి. ఒక్క గుంటూరు నగరంలో సుమారు 400, నరసరావుపేటలో 200లకు పైగా షాపులు ఉంటాయి. దీంతోపాటు, ఉమ్మడి జిల్లాలో మిగిలిన మండలాల్లో 100, ఇక డెల్టా లోని అన్ని మండలాల్లో పరిశీలిస్తే ప్రతిమండలంలో సుమారు 10 పది నుంచి 15 వరకు, మెడికల్ షాపులు ఉంటాయి. ఎంత లేదన్నా మైనర్ గ్రామానికి రెండు చొప్పున ఉం టాయి. అయినా ఎవరి వ్యాపా రం వాళ్లది.ఎందుకంటే కొంత మంది ఆర్ఎంపీ డాక్టర్లను అడ్డం పెట్టుకుని వ్యాపారం చేస్తారు. మరి కొన్ని చోట్ల ఏకంగా ఆర్ఎంపీ డాక్టర్లే మెడికల్ షాపులు పెడుతున్నారు.

#### జనరిక్.. మందుల జాడ ఎక్కడ?

ముందుల షాపుల్లో మోసాలుఇంతింతికాదయా.. ఇది నిజం. డాక్టర్లు రోగికి రాసే నాలుగు రకాల మందుల్లోను రెండు రకాల మందులు మాత్రమే బ్రాండెడ్ కంపెనీలవి ఇచ్చి మిగిలిన రెండు మందులు జనరిక్ మందులను అంట కట్టేస్తున్నారు. ఎందుకంటే ధరలో వ్యత్యాసమే కారణం. బ్రాండెడ్ కంపెనీకి చెందిన రక్తపోటును తగ్గించే 15 టాబ్లెట్ల షీటు ఎంఆర్‌పీ రూ.346లు ఉండగా అదే జనరిక్ మందులు 15 టాబ్లెట్లు ఎంఆర్‌పీ రూ.300లు ఉంటుంది. ఇది ప్రభుత్వం జనరిక్ పేరుతో రూ.150లకే మెడికల్ ఏజెన్సీలకు సరఫరా చేస్తూ అదే ధరకు విక్రయించాలని ఆదే శాలు జారీ చేసింది. మెడికల్ షాపు యజమాని ఎంఆర్‌పీ రూ.300లకు విక్రయి స్తాడు.అంటే ఆ ఒక్క షీట్‌లోనే రూ.150 లాభం అన్నమాట.. ఇలా కొందరు మెడికల్ షాపుల యజమానులు జనరిక్ మెడి సిన్ అడ్డం పెట్టుకుని దోచేస్తు న్నారు. ప్రజలకు ఏది జనరిక్ ఏది బ్రాండెడ్ తెలి యక పోవడంతో దోపిడీకితెగబడుతున్నారు. మరో పక్క ఇంటిం టికి తిరిగి వైద్యం చేసే ఆర్ఎంపీలు, పీ ఎంపీలు కొందరు ఈ జనరిక్ మెడిసిన్‌ను పరిమితికి మించి కొనుగోలు చేసి మధ్య,పేద వర్గాలకు ఖరీదైన మందుల పేరు తో విక్రయిం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గతంలో అధికారులు తనిఖీ చేసి కొంతమంది పీఎంపీ వైద్యులు,ఆర్ ఎంపీల వద్ద సుమారు రూ. లక్ష విలువైన రెండు వందల రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి కొన్ని మెడికల్ షాపుల్లో పనికిమాలిన రెండో రకం మందులు ఉన్న సంగతి డ్రగ్స్ అధికారులకు తెలిసినా లంచాలు గుంజి వదిలేస్తున్నట్లు సమాచారం. కొన్ని మెడికల్ షాపుల్లో వారు విక్రయించే మందులకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడం పరిమితికి మించి మందులు నిల్వ ఉండడంతో అప్పుడప్పుడు నామ్ కే నాస్తిగా.కేసు లు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. సిబ్బంది కొరతను బూచిగా చూపి మెడికల్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేయడం లేదు...మందుల వ్యాపారం కరోనా ముందు.. కరోనా తర్వాత అని చూడాలి.. ఎందుకంటే కరోనా తర్వాత చిన్న చిన్న మెడికల్ షాపుల వాళ్లు కూడాకోటీశ్వరులైపోయారు.. ఎందుకంటే తల పోటు వస్తే మెడిసిన్.. జ్వరం వస్తే మెడిసిన్.. జలుబు చేస్తే మెడిసిన్.. కరోనా భయం కారణంగా మందులు వాడని వాళ్లు లేరంటే అతిశయోక్తి కాదు.దీనికి ఇదే ఉబ్ నిదర్శనం..కరోనాకు ముందు జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి రూ. 50 వేలు అప్పు చేసి మెడికల్ షాపు పెట్టాడట. కరోనా రెండేళ్లు ముగిసేసరికి రూ. 50 లక్షల ప్రాఫిట్‌లోకి వచ్చేశాడట.. ఈ ఒక్క ఉదాహరణ చాలు.. మెడికల్ షాపుల వ్యాపారం ఎంత లాభసాటి అనేది. మరో పక్క ఔషధ నియంత్రణ శాఖ (డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) ప్రభుత్వ నిబంధనల ప్రకారం మందుల షాపులపై నిత్యం తనిఖీలు చేయాలి. జిల్లాల విభజన తరువాత ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. దీంతో మెడికల్ వ్యాపారం విచ్చలవిడిగా సాగిపోతోంది.

# క్లోరినేషన్ శాంపిల్స్ పరీక్షించండి

**గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నగరంలో త్రాగునీటి సరఫరాని పిన్ పాయింట్ గా క్లోరిన్ శ్యాంపిల్స్ పరిశీలించి ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నగర పాలక సంస్థ పరిధిలో శారదాకాలనీ, వసంతరాయపురం, శ్రీనగర్ లో త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ప్రత్యేక బృందాలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరితో కలసి పరిశీలించారు. శారదాకాలనీ రిజర్వయర్ నుంచి సరఫరా చేస్తున్న త్రాగునీటికి నిర్వహిస్తున్న క్లోరిన్ పరీక్షలను పరిశీలించారు. శారదాకాలనీ 21వ లైను మార్జిన్ ప్రాంతంలో, శ్రీనగర్ ఏడవలైనులో లో వైద్యారోగ్య శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను, పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. వసంతరాయపురం మెయిన్ రోడ్డులో వాల్ పిట్ శుభ్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అధికారులతో మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేస్తున్న త్రాగునీటిని అన్ని ప్రాంతాల్లో శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్ష ఫలితాల వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని, నిర్దేశించిన విధంగా ఫలితాలు లేకపోతే వెంటనే సంబంధిత అధికారుల దష్టికి తీసుకువచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైను వాల్ పిట్ వద్ద నీరు నిల్వ ఉండ కుండా చర్యలు తీసుకోవాలని, వాల్ పిట్ లో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తీసివేసి శుభ్రంగా ఉంచాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీటి పైప్ లైన్ల పై గుర్తించిన లీకులను యుద్ధప్రాతిపదికన మరమత్తు చేయాలన్నారు. మంచినీటి పైపులైను మరమ్మత్తు పనుల కారణంగా త్రాగునీటి సరఫరా నిలిపివేత, పునరుద్ధరణ పై ప్రజలకు పూర్తి స్థాయిలో ముందస్తుగా తెలియచేయాలని, ప్రత్యమ్నాయంగా ప్రజలకు అవసరం మేరకు ట్యాంకుల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయాలన్నారు. శారదాకాలనీలో ఇటీవల వాంతులు, విరోచనాలు లక్షణాలతో చికిత్స చేయించుకున్న వారి వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక బృందాలు ఇంటింటికి సర్వేకి వెళ్ళినప్పుడు గతంలో అనారోగ్యనికి గురై ఆరోగ్యం మెరుగుపడి ఇంటికి వచ్చిన వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకోవాలని, వారి కుటుంబసభ్యులకు ముందస్తు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. అనారోగ్య లక్షణాలు ఉన్న వారిని ప్రాథమిక దశలోనే సమీపంలోని ప్రత్యేక మెడికల్ క్యాంప్ లేదా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సంప్రదించి వైద్యసేవలు పొందాలని పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. నివాస ప్రాంతాల్లో శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన బోజనాలు వద్ద అందించే త్రాగునీటిని వైద్యారోగ్య, మున్సిపల్ శాఖ అధికారలు పరిశీలించి వారికి అవసరమైన సూచనలు అందించాలన్నారు. శ్రీనగర్ ఏడవ లైనులో స్థానికంగా



ఉన్న వాటర్ ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేదని స్థానికులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటర్ ప్లాంట్ ను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఫుడ్ కంట్రోలర్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రజలు త్రాగునీటి పై ఏ సమస్య ఉన్నా గుంటూరు నగరపాలక సంస్థ కంట్రోల్ రూమ్ 90000 02109 నంబర్ కి కాల్ చేస్తే తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడానికి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ కు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. విజయలక్ష్మీ, నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి, సీఎంహెచ్ఓ డా. ఆషా ఎంహెచ్ఓ మదుసూదన్, తూర్పునియోజకవర్గ తహశీల్దారు నగేష్, వైద్యారోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ల కార్యవర్గాల ఎన్నికలు





**విజయవాడ మేజర్ న్యూస్ :** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘంలో అంతర్భాగమైన విజయవాడ లోని మూడు డివిజన్లకు ఆదివారం గాంధీనగర్ లోని ఎన్జీవో హోం లో కార్యవర్గాల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ఒకటవ డివిజన్ అధ్యక్షులుగా జి. రాములు, సహాధ్యక్షులుగా సిహెచ్. హరి బాబు, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీనివాసరావు, ఎం. నవీన్ కుమార్, కార్యదర్శిగా వి. నరేంద్ర కుమార్, కార్యాలయ కార్యదర్శిగా కె. సందీప్, సంయుక్త కార్యదర్శులుగా కె. సుబ్రహ్మణ్యేశ్వరరావు, పివి నాగార్జున, కోశాధికారిగా ఎం శ్రీనివాసరావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండవ డివిజన్ కు కె. శ్రీధర్, సహాధ్యక్షులుగా ఎస్. రవి, ఉపాధ్యక్షులుగా ఎస్. శ్రీనివాసరావు, ఎం. ఆంజనేయులు, కార్యదర్శిగా ఎం విజయ్ కాంత్, కార్యాలయ కార్యదర్శిగా బి. కిరణ్ కుమార్ నాయక్, సంయుక్త కార్యదర్శు లుగా ఎ. సాయికుమార్, ఇర్ఫాన్ బేగ్, కోశాధికారిగా ఎస్.వి. సత్యనారాయణలు ఎన్నిక కాగా, మూడవ డివిజన్ కు అధ్యక్షులుగా కె.ఆర్.ఎస్. గణేష్, సహాధ్యక్షులుగా సహాధ్యక్షులుగా కె. హనుమాన్ బాబు, ఉపాధ్యక్షులుగా సిహెచ్. ఎస్. ముని కుమార్, పి. వేణుకుమారి, కార్యదర్శిగా ఎ. రవి, కార్యాలయ కార్యదర్శిగా కె. వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా పి. హఫీజ్ ఖాన్, జి.వి. సాయిప్రవీణ్, కోశాధికారిగా జి మాణిక్యవీణ ఎంపికయ్యారు. మూడు డివిజన్లకు ఎన్నికల అధికారులుగా సయ్యద్ జానీ బాషా, ఎస్. ఎల్. నరసింహారావు, ఎం. నాగరాజు వ్యవహరించారు. ఈ కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుందన్నారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర శాఖ కార్యదర్శి సుధాకర్, అధికారి జి ఎన్ వి రత్నకుమార్ అభినందించారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సమస్యను పరిష్కరించేలా తమ తమ కార్యవర్గాలు బాధ్యతాయుతంగా పనిచేస్తామని ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గానికి ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, కార్యదర్శి ఎండి

## నగరం లోని మూడు డివిజన్ల కార్య వర్గం ఎన్నిక ఏకగ్రీవం

ఇక్బాల్ నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ శ్రీరామ్ కె.సంపత్ ఉమార్ ఇతర కార్యవర్గ సభ్యులు వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘాల నాయకులు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ఎన్జీవో ఆధ్వర్యంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సమాజ సేవ చేసిన వారిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో సేవ చేస్తున్న వారిని గుర్తించి అవార్డు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ గ్రేడ్ వన్ ఆఫీసర్ రమాదేవి మేడంకి బెస్ట్ సర్వీస్ అవార్డు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ అయ్యప్ప అరుణాచల నేషనల్ ఉమెన్ ప్రెసిడెంట్ డాక్టర్ అమ్మిరెడ్డి రజిని నేషనల్ చైర్మన్ రాజా పాల్గొన్నారు.

# రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఉదయం నడక మిత్రులతో జనసేన పార్టీ నాయకులు రాష్ట్ర బిసి నాయకులు, సర్పంచ్‌ల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు కొద్ది సేపు మాట్లాడారు. ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా ప్రభుత్వ డిగ్రి కళాశాలలో వాలీబాల్ ఆడుతున్న యువతతో, క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులతో కొద్ది సేపు ముచ్చటించగా బిసి కాలనీలో షెటిల్ ఆడుతున్న యువతతోనూ ముచ్చటించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే జనసేన, తెలుగుదేశం పార్టీల సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రానికి అవసరం ఎంతైనా ఉందన్నారు. గడిచిన 5 సంవత్సరాల్లో జగన్‌మోహన్‌రెడ్డి న్యాయకత్వంలో రాష్ట్రం అదోగతి పాలయ్యిందని, యువతకు ఉపాధి కల్పించకపోవడం, రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని, విజన్ గల నాయకుడు చంద్రబాబు అని, ముందు చూపు, దూర దృష్టితో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల తరుపున ప్రభుత్వంపై పోరాటం చేస్తూ అన్ని రంగాల్లోనూ విజయం సాధిస్తున్నారని, యువత అంతా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చిలకలపూడి పాపారావు అన్నారు. చిలకలపూడి పాపారావు మాత్రం వినూత్నంగా రోజు ఉదయం మార్నింగ్ వాక్‌లో ఉన్న ప్రజల్లోకి జనసేన సిద్ధాంతాలను బలంగా తీసుకువెళ్తున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరిస్తూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీకి ఓటు వేసి విజయాన్ని చేకూర్చాలని పార్టీని మాత్రం బలంగా ప్రజల్లోనికి తీసుకువెళ్ళేందుకు సాయశక్తులా కృషి చేస్తున్నారు.



# గుమ్మనంగా నియోజకవర్గంలో రాజకీయం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో రాజకీయం మాత్రం గుమ్మనంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయం వేసవితోపాటు వేడెక్కుతున్నా నియోజకవర్గంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా చడిచప్పుడు లేకుండా ఉంది. గత 4 రోజుల క్రితం వరకు నియోజకవర్గంలో బాబు షురిటీ భవిష్యత్ గ్యారింటీ పేరుతో తెలుగుదేశం పార్టీ నేతలు ఇంటింటికి తిరిగి తెలుగుదేశం, జనసేన ల మినిమానిఫెస్టోను వివరిస్తూ తెలుగుదేశం,జనసేన పార్టీల అధికారం చేపడితే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు వెళ్తున్నారు. నెల రోజుల క్రితం వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ రేపో మాపో వెలువడనున్నట్లు వార్తలు వస్తున్న తరుణంలో నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కాల్సినది పోయి నియోజకవర్గంలో స్థబ్బత ఏర్పడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడిగా శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబును, అవనిగడ్డ శాసనసభ్యులుగా దివంగత మాజీ మంత్రి కుమారుడు క్యాన్సర్ వైద్య నిపుణులు డా॥ సింహాద్రి చంద్రశేఖర్ రావు పేర్లను ప్రకటించారు. అయితే దీనిపై డా॥ చంద్రశేఖర్ రెండు పర్యాయాలు అవనిగడ్డ వచ్చినప్పటికి పత్రికాముఖంగా ఏ విషయం తెలియచేయలేదు. సింహాద్రి రమేష్ బాబు సైతం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో కూడా ఏ విధమైన రాజకీయ ప్రకటనలు చేయడం లేదు. జనసేన, టిడిపి పొత్తులో భాగంగా ఏ పార్టీ అభ్యర్థి పోటీలో ఉండేది కూడా ప్రకటించకపోవడంతో జనసేన తరుపునే అభ్యర్థిని ప్రకటిస్తారని పలువురు పేర్కొంటున్నప్పటికి జనసేన, టిడిపి పార్టీల అధ్యక్షులు మాత్రం ఏ విధమైన ప్రకటన చేయలేదు. ఎవరి అభిమానం వారు చాటుకుంటూ తెలుగుదేశం పార్టీకే ఇస్తారని ఆ పార్టీ నేతలు, కాదు జనసేన పార్టీకే ఇస్తారని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటూ ఉండగా, జనసేన పార్టీలో నాయకులు ఎక్కువ కావడంతో ఎవరికి వారే మా నాయకుడికే టికెట్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్నాయని వేడి పుట్టిస్తున్నప్పటికి నియోజకవర్గంలో మాత్రం నేటి వరకు ఏ విధమైన చడిచప్పుడు లేకుండా ఉండడం, దీనికి తోడు సోషల్ మీడియాలో మాత్రం ఎవరికి నచ్చినట్లుగా వారు పోస్టులు పెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితిలో నియోజకవర్గంలో నామినేషన్‌ల ఘట్టం పూర్తి అయ్యే రోజున బి ఫారం ఆ యా పార్టీల అధ్యక్షులు ఎవరికి ఇస్తే వారే అభ్యర్థులు అయ్యే సూచనలే కనిపిస్తున్నాయి కానీ, ముందుగా పలనా పార్టీ నుండి పలనా అభ్యర్థి పోటీలో ఉంటారని చెప్పడం మాత్రం కష్టతరంగా మారింది. జిల్లాలో పెడన నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిని 20 రోజుల క్రితమే ప్రకటించడంతో ఇంటింటికి నవరత్నాలను తీసుకువెలుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు వెళ్తున్నారు. అయితే ఏది ఏమైనా ప్రధాన పార్టీలు మాత్రం అభ్యర్థులను ముందుగా ప్రకటిస్తేనే బాగుంటుందని ద్వితియ శ్రేణి నాయకులు చెప్పుకొస్తున్నారు. ముందుగా ప్రకటిస్తే బుజ్జగింపులతో ముదుకు వెళ్ళేందుకు అవకాశం ఉంటుందని, అప్పటికప్పుడు ప్రకటిస్తే బుజ్జగింపులతోనే ఎన్నికల తేది వస్తుందని, ఆ సమయంలో ఎన్నికలకు సమాయత్తం కావాలా.......... బుజ్జగింపులతో సరిపెట్టాలో కూడా అర్థం కానీ పరిస్థితి నెలకొంటుందంటున్నారు. వైసిపి అభ్యర్థినిని ప్రకటించినప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు ఫిబ్రవరి 5 వ తేదిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు, వారి కుమారుడు రామ్‌చరణ్ కప్పుకుని తీర్థం తీసుకున్నారు. అనంతరం డా॥ చంద్రశేఖర్ తాడేపల్లిలో సిఎం సమావేశం అనంతరం అవనిగడ్డ వైయస్‌ఆర్‌సిపి ఇన్‌చార్జ్ డా॥ సింహాద్రి చంద్రశేఖర్‌రావు మిడియాతో మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గ వైయస్‌ఆర్‌సిపి సమన్వయ కర్తగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు, కానీ నా వయస్సు రీత్య నా కుమారుడు అయిన రామ్‌చరణ్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం జరిగిందని, ఇక నుండి రామ్‌చరణ్ అవనిగడ్డ వైయస్‌ఆర్‌సిపి ఇన్‌చార్జ్‌గా ప్రతి గడపకు తిరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందించిన నవరత్రాలను మరింత విస్తృతంగా ప్రజలకు తెలియచేస్తూ రానున్న ఎన్నికల్లో వైయస్‌ఆర్‌సిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తాడని అవనిగడ్డ ప్రజలకు మూడు తరాలుగా నా తండ్రి సింహాద్రి సత్యనారాయణ వారసత్వాన్ని నా కుమారుడు రామ్‌చరణ్ నిలబెట్టుకుని నియోజకవర్గ ప్రజలకు సేవలందించడానికి సిద్దంగా ఉన్నాడని, నియోజకవర్గ ప్రజలంతా గతంలోలా మా కుటుంబాన్ని ఆదరించి మా కుమారుడిని ఆశీర్వదించలని విన్నవించుకున్నారు. ఈ ప్రధాన పార్టీలు ఈ విధంగా ఉండగా మరో ఇద్దరు లేక ముగ్గురు ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్దంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితి మాత్రం రాజకీయ కోణంగా గుమ్మనంగా నెలకొంది.



## నగర పాలక సంస్థలో సీసీ రోడ్లు శంకుస్థాపనలు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం నగర పాలక సంస్థలొ పలు డివి జన్లలో మచిలీపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ పేర్ని కృష్ణ మూర్తి (కిట్టు) సి.సి.రోడ్లు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని 1వ డివిజన్‌లో 20 లక్షల రూపాయలతో ఎంపి అయోధ్య రామిరెడ్డి నిధులతో పార్క్ ప్రహరీ గోడకు, 15.50 లక్షలతో సి.సి. రోడ్ కి తరవాత 50 వ డివిజన్‌లో సుమారు 53 లక్షలతో 4 సి.సి.రోడ్లకు, అలాగే 46వ డివిజన్లలో 17.42 లక్షలతో సి.సి. రోడ్లకు శంకుస్థాపన చేసిన మచిలీపట్నం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ పేర్ని కృష్ణ మూర్తి(కిట్టు). అనంతరం ముడుగుళ్ళ సెంటర్ నుండి చిలకలపూడి రైల్వేస్టేషన్ వరకు సుమారు 38 లక్షలతో సెంటర్ లైటింగ్ కి శంకుస్థాపన కార్యక్రమము నిర్వహించారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ సుమారు 1.43 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరిగిందాన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మడపాటి విజయలక్ష్మి, పట్టణ అధ్యక్షులు షైక్ సిలర్ దాదా, 1వ డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి, 50వ డివిజన్ కార్పొరేటర్ మరీదు రటలమ్మ, 46వ డివిజన్ కార్పొరేటర్ బోగాది సాయి, 5వ డివిజన్ కార్పొరేటర్ వేముల గాంధీ, 6వ డివిజన్ కార్పొరేటర్ పర్ణం సతీష్, 7వ డివిజన్ కార్పొరేటర్ పడమట రేవతి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ డివిజన్ల ఇంచార్జ్‌లు, వైస్సార్సీపీ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాబోయేది జనసేన, టీడీపీల సంకీర్ణ ప్రభుత్వమే



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, తెలుగు దేశం పార్టీలు విజయం సాధించి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నా యని పారిశ్రామిక వేత్త, జనసైనికులు విక్కుర్తి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హైదరాబాదులో ఉపాధి కోసం స్థిరపడిన నియోజకవర్గానికి చెందిన పలువురు జనసైనికులు విక్కుర్తి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. జనసేన పార్టీ విజయం కోసం శ్రీనివాస్‌తో కలిసి నడుస్తాం అని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా కృషి చేస్తానని తనను కలిసిన యువతకు శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

## లక్ష్మీ కుమారికి ఘన నివాళులు



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** గుం టూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి కేవస్ రామకృష్ణారావు సతీమణి కం దెపు అనంతలక్ష్మి కుమారికి మచి లీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, మచిలీపట్నం 15 డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ గుంటూరులో ఘనంగా నివాళులర్పించారు. గత వారం ఫిబ్రవరి ఆరో తారీఖున అనారోగ్యంతో మరణించిన అనంతలక్ష్మి కుమారికి ఆదివారం లంకి శెట్టి దంపతులు గుంటూరు పట్టాభిపురంలో జరి గిన కార్యక్రమంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. న్యాయ మూర్తి రామకృష్ణారావుకు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి, భగవంతుడు మనో ధైర్యాన్ని ఇవ్వాలని వారు కోరారు. న్యాయవ్యవస్థలో మంచి పేరు సంపాదించి అంచలంచలుగా ఎదిగిన జిల్లా న్యాయమూర్తి కే.రామకృష్ణారావుకు కీలకమైన సమయంలో భార్యని కోల్పోవడం అత్యంత విచారకరమని బాలాజీ అన్నారు.

## ఐడీబీఐ బ్యాంక్ ఉత్సవ్ ఎఫ్‌డీ పథకం కింద ప్రత్యేక రేట్లు

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఐడీబీఐ బ్యాంక్ స్పెషల్ లిమిటెడ్ పీరియడ్ కాల్ చేయదగిన 300 రోజుల ఎఫ్‌డీ యొక్క తాజా ఆఫర్‌ను 7.55 శాతం వార్షిక గరిష్ట రేట్లతో పరిచయం చేసింది. సరికొత్త ఉత్సవ్ ఎఫ్‌డీ పథకం, తక్కువ వ్యవధిలో ఆకర్షణీయమైన రేట్లను కోరుకునే వినియోగదారులకు అవకాశాన్ని అందిస్తుంది. ఇది కాకుండా.. 375 రోజులు, 444 రోజులకు ప్రస్తుతం ఉన్న ఉత్సవ్ ఎఫ్‌డీలు వరుసగా 7.60 శాతం, 7.75 శాతం వరకు పోటీ రేట్లను అందిస్తూనే ఉన్నాయి.

# పటిష్ఠంగా పంచాయితీ వ్యవస్థ







### గ్రేడ్ 5 కార్యదర్శులకు ప్రత్యేక అధికారాలు

### జీవో ఎం.ఎస్ 11 జారీతో హర్షం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయితీ వ్యవస్థ దేశంలో ప్రతిష్ఠంగా మారనుంది. గ్రేడ్ 5 కార్యదర్శులు డిఇఓ అధికారులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం 11ను జారీ చేసింది. దీంతో గ్రామ పంచాయితీలకు ఇన్‌చార్జీల వ్యవస్థ ఇబ్బందులు తొలగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జివోతో గ్రామ స్వరాజ్య స్థాపనలో మరో ముందడుగు పడనుంది. ప్రజా సమస్యలు త్వరగా కానున్నాయి. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల అనంతరం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 6500 పంచాయితీలకు కార్యదర్శులను నియమించారు. వీరినే గ్రేడ్ 5 కార్యదర్శులుగా విడకొట్టారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 650 మంది ఉన్నారు. గత 4 సంవత్సరాలుగా వీరికి పలు విధాలుగా శిక్షణ ఇచ్చినా కొన్ని సాంకేతిక కారణాలతో పంచాయితీ కార్యదర్శులకు ఉన్న అధికారాలు మాత్రం ఇవ్వలేదు. గ్రామ సభల నిర్వాహణ, సర్టిఫికేట్ల జారీ చేసే అధికారాలు, తీర్మానాలు వీరికి లేవు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనేవారు. పంచాయితీ వ్యవస్థ పటిష్ఠంగా..

గ్రామ పంచాయితీ కార్యదర్శి 3,4 పంచాయితీలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించి రావాల్సి ఉండగా పలు కార్యక్రమాల నిర్వాహణ ఆలస్యం అవ్వడంతో ప్రజలు ఇన్‌చార్జ్ కార్యదర్శుల కోసం ఎదురు చూపులతో సరిపోయేది. 3 రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ 5 కార్యదర్శులకు అధికారాలు ఇస్తూ జీవో ఎం.ఎస్ 11 ను జారీ చేయడం ఆ జీవోతో వీరికి డిడిఓ అధికారాలు కల్పించారు. ఈ చర్యతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలకు కార్యదర్శులు అందుబాటులోనికి వచ్చారు.

**అందుబాటులోనికి మరిన్ని సేవలు :** ఇప్పటి వరకు జనన, మరణ, వివాహ జామీను సర్టిపికేట్ కోసం ప్రజలు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. 3,4 పంచాయితీలకు ఒక్కరే కార్యదర్శి కావడంతో సర్టిఫికేట్ జారీ ఆలస్యం అవుతూ ఉండేది. గ్రేడ్ 5 కార్యదర్శులకు అధికారాలు ఇవ్వడంతో ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి. గ్రామాలకు ఆత్మల చెప్పుకునే గ్రామసభలు ఇకపై జాప్యం కాకుండా జరగనున్నాయి. రిజిస్టర్ రికార్డుల నిర్వాహణ వేగవంతంగా జరుగుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 4 సంవత్సరాలుగా ఉన్న ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో గ్రేడ్ 5 కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబును తన కార్యాలయంలో నియోజకవర్గంలో పనిచేస్తున్న కార్యదర్శులంతా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి రమేష్ బాబుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేశారు.

# ఘనంగా దేవినేని చంద్రశేఖర్ సంస్మరణ కార్యక్రమం





**నందిగామ, ఫిబ్రవరి 18, మేజర్ న్యూస్ :** జల వనరుల శాఖ మాజీ మంత్రి,టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు సోదరుడు దేవినేని చంద్రశేఖర్ దశదిన కర్మ కార్యక్రమం ఘనత నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని చిత్రపటానికి పూల మాలలు నివాళులర్పించారు. ఆదివారం కంచికచర్ల ఓసి క్లబ్ ఎదురుగా జరిగిన సంస్మరణ కార్యక్రమంలో మాజీ మంత్రులు నెట్టెం రఘురాం, కొల్లు రవీంద్ర, మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య, గన్నవరం ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కేసినేని చిన్ని, అమరావతి జేఏసీ నేతలు కొలికపూడి శ్రీనివాస్, పోతుల బాలకోటయ్య, తిరువూరు ఇంచార్జ్ శావల దేవదత్, మాజీ శాసన సభ్యులు రావి వెంకటేశ్వరరావు, సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఆళ్ళ గోపాలకృష్ణ, జాస్తి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి గాంధీ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, మైలవరం, నందిగామ నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొని చంద్రశేఖర్ కు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు పరామర్శించారు.ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం బకాయిల కోసం 22న సామూహిక రాయబారం



**గన్నవరం, ఫిబ్రవరి 18, మేజర్ న్యూస్ :** ధాన్యం బకాయిల కోసం ఈనెల 22వ తేదీన 10గంటలకు విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద సామూహిక రాయబారం కార్యక్రమం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు తెలిపారు. ఆదివారం గన్నవరంలోని సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం దినదిన గండంగా మారుతుందని, పంట విత్తిన రోజు నుండి, చేతికి వచ్చేవరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. ఎరువులు, పురుగుమందులదరలు అందుబాటులో ఉండటం లేదన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో, ట్రాక్టర్ కిరాయిలు, కోత, పొత యంత్రాలు, స్ప్రేయర్ల కిరాయి ఖర్చులు పెరిగిపోతున్నాయనీ చీడ, పీడలు ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయని చెప్పారు. ఈ సంవత్సరం సీజన్ ప్రారంభంలో అధిక వర్షాల వలన, నారుమళ్ళు, ఎద జల్లినవి, నాట్లు వేసినవి డ్రైనేజ్ సౌకర్యం సరిగ్గా లేక మునిగిపోవడంతో, తిరిగి మరల నాట్లు వేయడానికి రెండు రెట్లు ఖర్చు పెరిగిందన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను రావటంతో పనల మీద ఉన్నవని, నిలువు మీద ఉన్నవి కూడా నీటిలో నాని, రైతు విపరీతంగా నష్టపోయి, నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ధాన్యం రంగు మారి, పాయ రావటంతో, మిల్లర్లు, మధ్య దళారులు ధర తెగ్గోసి కొన్నారన్నారు. ఇన్ని కష్టాల మధ్య ఆర్. బి. కే ల ద్వారా ధాన్యం అమ్మితే జనవరి 13 తర్వాత రైతు ఖాతాలలో ఇప్పటివరకు నగదు జమ కాలేదన్నారు.

దీనితో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, కుప్ప నూర్పిడి చేసిన ట్రాక్టర్ కిరాయిలకు, వ్యవసాయ కార్మికులకు, రెండో పంటగా సాగు చేస్తున్న మినుముకు మందుల కొనుగోలుకు అప్పుల కోసం తిప్పలు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో కృష్ణా జిల్లాలో 3.54 లక్షల ఎకరాల్లో వరి సాగయిందనీ పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేశారన్నారు. ఆర్.బి.కెల ద్వారా 984. 86 కోట్ల విలువ కలిగిన 4,59, 758 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని ఇంకా కుప్పలు నూర్చవలసినది 25శాతం ఉంటుందన్నారు. కావున ధాన్యం బకాయిల కోసం ఈనెల 22వ తేదీన విజయవాడ రాష్ట్ర సివిల్ సప్లై ఆఫీస్ వద్ద జరిగే, సామూహిక రాయబార కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

# మరో స్వాతంత్ర్య పోరాటానికి యువత సిద్ధంగా ఉండాలి

## జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రావిపాటి పిలుపు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** రానున్నది ఎన్నికల సమరశంఖారావం మాత్రమే కాదు ఓటు అనే ఆయుధంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు మరో స్వాతంత్ర పోరాటానికి ప్రతి పౌరుడు సిద్ధంగా ఉండాలని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రావిపాటి సాయి కృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారం ఆయన మాట్లాడుతూ ఆనాడు శాంతి అనే ఆయుధాన్ని వాడితే నేడు మీరు వేసే ఓటే నేటి ఆయుధమని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల శంఖారావంలో భాగంగా మొట్టమొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోబోయే యువతీ యువకులకు ఈ రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు ఆవశ్యకతను వివరిస్తూ చేపట్టిన My First Vote to CBN పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకునే యువతతో గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఎపి లీడర్స్ గా, వారియర్స్ గా ఎంపిక కాబడిన వారితో కలిసి అరండల్ పేటలో ఓటు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ఓటు వెయ్యాలి,ఎవరికీ ఓటు వెయ్యాలి,ఎలా వెయ్యాలి అనే అంశాల పైన మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోబోయే యువకులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఓటు వేసే ప్రక్రియలో ఎలాంటి మెళకువలు పాటించాలో కళ్ళకు కట్టినట్లు చూపుతూ ఏర్పాటు చేసిన డమ్మీ ఈవీఎంలు వాటిల్లో ఉన్న బటన్లు నొక్క గానే గుర్తు పక్కనే ఎరుపు రంగు లో ఉన్న లైట్ వెలుగుతూ ఓటు పడ్డట్లు శబ్దం వచ్చేలా ఏర్పాటు చేయడం, ఓటు వేసాక వి వి ప్యాట్ లో కనపడి అదృశ్యం అయ్యే స్లిప్ నమూనాలను యువకులతో ఓటు వేయించి పంచి పెట్టిన తీరు యువతను భారీగా ఆకట్టుకుంది. ఎపి వారియర్స్ అయిన జెట్టి జానకి రామయ్య,ఘంటా మౌళిక,నేపాక పద్మ తథితరులు మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోబోయే యువతను ఉద్దేశించి మాట్లాడుతూ పలు అంశాల పైన అవగాహనా కలిగించారు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# ఘనంగా ఖిద్మత్ టీమ్ ఐదవ వార్షికోత్సవ వేడుకలు



**మంగళగిరి,మేజర్ న్యూస్:**నవ్యనగరం మంగళగిరి కి చెందిన ఖిద్మత్ టీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఐదవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పుర వీధుల్లో ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.ద్విచక్ర వాహనాలకు జాతీయ జెండాలు,ఖిద్మత్ టీమ్ లోగో జెండాలు కట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ర్యాలీలో కుల,మత,రాజకీయాలకు అతీతంగా యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ర్యాలీ నిడమర్రు రోడ్డు నుంచి ప్రారంభమై పాత బస్టాండ్ సెంటర్,గౌతమ బుద్ధా రోడ్ మీదుగా కొత్త బస్టాండ్, అంబేద్కర్ విగ్రహం సెంటర్, ఆర్ అండ్ బి బంగ్లా వద్దకు చేరింది. అనం తరం అక్కడి నుంచి తిరిగి గౌతమ బుద్ధా రోడ్డు మీదుగా చినకాకాని వై జంక్షన్ మీదుగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు మీదుగా వీజే కళాశాల,గణపతి నగర్ మీదుగా నృసింహుని గాలి గోపురం సెంటర్ వద్దకు చేరింది. అనంతరం అక్కడి నుంచి మెయిన్ బజారు మీదుగా పూల మార్కెట్ సెంటర్,మిద్దె సెంటర్ మీదుగా పాత బస్టాండ్ సెంటర్,నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకోవడంతో ర్యాలీ ముగిసింది.అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఖిద్మత్ టీమ్ కన్వీనర్ షేక్ షఫీ మాట్లాడుతూ..ఖిద్మత్ టీమ్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్య వాదాలు తెలిపారు.గత నాలుగేళ్లుగా తమ ఖిద్మత్ టీమ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. కుల,మత,రాజకీయాలకు అతీతంగా ఖిద్మత్ టీమ్ తన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.ఆపదలో ఉన్న పేద ప్రజలకు ఖిద్మత్ టీమ్ ఎల్ల వేళలా అందుబాటులో ఉంటుందని, పేదలు ఎదుర్కొనే ఎటువంటి సమస్యలైనా తమ ఖిద్మత్ టీమ్ సభ్యుల దృష్టికి తీసుకువస్తే తప్పకుండా తమ వంతు సహాయం అందజేస్తామన్నారు.

# నైతిక విలువలే విద్యార్థి ఉన్నతికి సోపానం..






**మంగళగిరి, మేజర్ న్యూస్:** విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, సృజనాత్మకత, నైతిక విలువలు కలిగి ఉండాలని అప్పుడే ఉన్నత విజయాలు సాధిస్తారని కేంద్ర ప్రభుత్వ శాఖ అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ వెనిగళ్ళ అశోక్ కుమార్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఎస్ ఎల్ ఎం హైస్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యదశ నుంచే క్రమశిక్షణతో ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవడానికి అర్హత సాధిస్తారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మంచి భావాలే బాటలు వేస్తాయని వారి అమూల్య మైన సందేశాన్ని అందించారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.వి.ఎస్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, ప్రతీ ఏడాది పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు బడి పట్ల విద్యార్థుల్లో నమ్మకం, విశ్వాసాన్ని నింపుతాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి,వారితో విద్యాపరమైన సామాజిక అంశాలపై చర్చించడం ద్వారా వారిలో భయం పోతోందన్నారు. చదవుతో ఆటపాటలు కూడా చాలా అవసరం అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రతిభను తిలకించడానికి భారీగా తరలి వచ్చారు. పిల్లల ప్రతిభను చూసి తల్లిదండ్రులు ముగ్ధులయ్యారు.7వ తరగతి చదుతున్న విద్యార్థులు ఇంట్లో పిల్లల కోసం తల్లిదండ్రులు పడే కష్టం,ఆవేదన గురించి అందరికీ అర్థం అయ్యేలా డాన్స్ రూపంలో చూపించారు ఈ డాన్స్ చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు,అతిథులుకి సైతం కంటతడి పెట్టెంచెల చేసింది. ఆ నృత్యంలో తల్లిదండ్రులు కష్టాన్ని చూపించిన విద్యర్థలలో ఒకరికి అక్కడే డాన్స్ చూస్తున్న కారుణ్య అనే విద్యార్థి తాతయ్య జయపాల్ నగదును బహుమతిగా అందజేశారు.ఈ కార్యక్రమంలో దనేకుల ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ హెచ్ఓడి సురేష్,సాఫ్ట్వేర్ ఇంజనీర్ మోతే మధు,హైస్కూల్ డైరెక్టర్ సిందే బాలకృష్ణ,ప్రిన్సిపల్ రామ్ చంద్,హెచ్ఎం సుభాషిణి,పాత మంగళగిరి ఎస్ఎల్ఎం ప్రిన్సిపాల్ ప్రసాద్,లక్ష్మి తదితర ఉపాధ్యాయిని, ఉపాద్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరలు పాల్గొన్నారు.

## డీవీసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**పొన్నూరు మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామంలో ఆదివారండివిసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, ఎము కలు కీళు ,స్త్రీల, ప్రసూతి వైద్య విభాగాలకు సంబంధించిన నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 650 మందికి పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రారంభించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మెడి కల్ డైరెక్టర్ సీఓఓ పర్యవేక్షించారు. వైద్య శిబిరం విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ల బృం దాన్ని, సిబ్బందిని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అభినందించారుఅలాగే వైద్య శిబిరానికి సహకరించిన స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు.



## సత్రం నిర్మాణంకు చేయూత అభినందనీయం



**లాలుపురం (గుంటూరు), మేజర్ న్యూస్:** గుంటూరు మండలం లాలుపురం గ్రామంలో ప్రధాన రహదారిపై నిర్మించిన కైలాస క్షేత్రం (సత్రం) నిర్మాణంకు గ్రామస్తులు అందిస్తున్న చేయూత అభినందనీయం అని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఆర్ సీతా రామాంజనేయులు (లాలుపురం రాము) కొనియాడారు. గతంలో నిర్మించిన అపకర్మల సత్రంను గ్రామ ప్రజలు అందించిన సుమారు రూ.11 లక్షలతో ఆధునీకరించారు. ముందు భాగంలో ఇనుప రేకులు షెడ్డు, వంటగది, మరుగుదొడ్లు నిర్మాణం తో పాటుగా రంగులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం లాల్పురం రాము రిబ్బన్ కట్ చేసి పునః ప్రారంభించారు. అనంతరం సత్రం అభివృద్ధికి కృషి చేసిన వారిని రాము అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు తన్నీరు సత్యానారాయణ, కాటూరి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కాటూరి వెంకటేశ్వర రావు, నిశంకర శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ తుళ్ళూరు మండల కన్వీనర్ ఎంపిక



**తుళ్లూరు మెజర్ న్యూస్ :** ఎమ్మార్పీఎస్ తుళ్ళూరు మండల కన్వీనర్ గా సలివేంద్ర ప్రభాస్, కో కన్వీనర్ గా యువరాజ్ నియమితులయ్యారు. గుంటూరు జిల్లా కన్వీనర్ కొమరాల శ్రీనివాస్ ఆదివారం తుళ్ళూరులో జరిగిన సమావేశంలో వారిని ఎన్నుకున్నారు. ఉసురుపాటి బ్రహ్మయ్య సారథ్యంలో తుళ్ళూరు మండలంలో మాదిగల సమస్యల పట్ల పోరాడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ రాజేష్, జిల్లా సీనియర్ నాయకులు ఎటుకూరి విజయ్, నండూరి జయపాల్, నండూరి రాజు, ప్రత్తిపాటి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల సమక్షంలో ఏబీఎం చర్చి ఆరాధన

**తెనాలిక్రైమ్, మేజర్ న్యూస్:** రూరల్ మండలం కొలకలూరు గ్రామ ఏబిఎం చర్చిలో గత నాలుగు వారాల నుంచి పోలీసుల సమక్షంలో ఆరాధన జరుగుతుంది. అందుకు కారణం గ్రామానికి చెందిన వైసీపీ నేతేనని పలువురు వాపోతున్నారు.ప్రశాంతంగా జరగాల్సిన ఆరాధనను పోలీసుల సమక్షంలో జరుపుతున్నాడని,అతనికి పెద్దల మద్దతు లేకపోయినప్పటికి ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల వద్ద ఇతని పెత్తనం ఉండాలన్నా ఉద్దేశ్యంతోనే కేవలం ఇలా చేస్తున్నాడని సంఘస్తులు చెబుతున్నారు. గత రెండు వారాల క్రితం ఆరాధన జరగకుండా కొంతమందిని రెచ్చగొట్టి ఆరాధన జరుగకుండా ఖజానాదారుడైన అత్యాల చిట్టిబాబుపై అందరి సమక్షంలోనే దాడికి పాల్పడ్డాడు. ఆ విషయమై చిట్టిబాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా న్యాయస్థానాల ప్రమేయంతో అతనిపై తాలూకా పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అంతేకాకుండా ఈ విషయమై గత మూడేళ్ళ క్రితం న్యాయ స్థానాలను వారు ఆశ్రయించగా వారికి తీర్పు అనుకూలంగా రాలేదు, అయినప్పటికీ న్యాయస్థానాలను దిక్కరిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. తీర్పు కాపీలను పోలీసు వారికి అందించినప్పటికీ వారు కూడా గమనించడం లేదని సంఘ పెద్దలు చెబుతున్నారు.పోలీసులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించి ఆరాధన సజావుగా జరిగేలా చూడాలని కోరుకుంటున్నారు.

## సూర్యనారాయణ స్వామి వారికి విశేష పూజలు



అవనిగడ్డ మేజర్ న్యూస్ : సూర్యనారాయణ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మండల పరిధిలోని వేకనూరులో ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకులు దివి నరసింహమూర్తి స్వామి వారికి ముందుగా కృష్ణానదీ జలాలతో అభిషేకించి నవవిధ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు, అర్చనలు అనంతరం విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా సుదీర్ఘ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వడ్డీ దినేష్ కుటుంబానికి టీడీపీ నేత రవీంద్ర పరామర్శ



మచిలీపట్నం, మేజర్ న్యూస్ : మచిలీపట్నంలో పార్కు గేటు మీద పడి మృతిచెందిన ఆరేళ్ల బాలుడు వడ్డీ దినేష్ కుటుంబాన్ని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్రా మాట్లాడుతూ బాలుడు మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమనీ మండిపడ్డారు. నాసిరకం పనులతో పార్కు నిర్మాణం చేపట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో బ్రహ్మపురంలోని మున్సిపల్ పార్కు గేటు మీద పడి ఆరేళ్ల బాలుడు వడ్డీ దినేష్ మృతి చెందడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన బాలుడు మృతి పట్ల తీవ్ర సంతాపం తెలియజేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.44లక్షలతో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా కాలం పార్కు పనులను నిలిపి వేశారు. ఇటీవలే పార్కు నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడంతో బలంగా ఉండాల్సిన పార్కు గేటు ఊడిపోయిందని, ఫలితంగా ఓ పసి కందు ప్రాణం పోయింది అన్నారు.

## నేడు స్పందన



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ పి. రాజా బాబు పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



నందిగామ మేజర్ న్యూస్: మండలం లోని కేతవీరునిపాడు గ్రామములో ఆదివారం సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.తెలుగుదేశం పార్టీ నేతల ఆత్మీయ సమావేశంలో స్థానిక తెదేపా నేతలు మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్యతో కలిసి కేశినేని ఫౌండేషన్ చైర్మన్, తెలుగు దేశం పార్టీ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. ఆత్మీయ సమావేశంలో గ్రామములో నెలకొన్న సమస్యలు,అధికార పార్టీ నేతల అరాచకాలు, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న విధ్వంసకర పరిస్థితులు, వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందులను,రానున్న ఎన్నికలను అత్యంత కీలకంగా ఎదుర్కొనటం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలను తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను కమ్మేస్తున్న మంచు



**నీటి మంచు దుప్పటిలో గ్రామాలు**
**పెరుగుతున్న చలి తీవ్రత**
**వణికిస్తున్న చలి**
**ఉదయం 9 అయినా**
**కనిపించని భానుడు**
**ప్రమాదకరంగా మారిన**
**తెల్లవారుజాము ప్రయాణాలు**

అవనిగడ్డ మేజర్ న్యూస్ : శీతాకాలం ప్రారంభమై 70 రోజులు దాటిపోయినప్పటికి గత వారం రోజులుగా దివిసీమ వ్యాప్తంగా నీటి మంచు కమ్మేస్తుంది. సాయంత్రం నుండే చలి తీవ్రత పెరగడంతో ఉదయం 9 గంటలు అయినా సూర్య భగవానుడు కనిపించని పరిస్థితి. చలి గాలుల తీవ్రతతో రోజు రోజుకు పెరగనుండటంతో ఉష్ణోగ్రతలు కూడా అదే స్థాయిలో పెరిగిపోవడంతో గ్రామీణ ప్రజలు చలికి వణికిపోతూ, పగటి సమయంలో బయటకు వచ్చేందుకు బయపడుతున్నారు. బయటకు రావడానికి చిన్నారులు, వృద్దులు ఇబ్బందులు పడుతున్న నీటి మంచు కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరో వారం రోజుల పాటు ఇదే కొనసాగవచ్చని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఉదయం సమయంలో ప్రయాణాలు ప్రమాదకరం అని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికి తప్పనిసరి పరిస్థితులలో ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. అయితే ఈ నీటి మంచు వలన మామిడికాయ రైతులకు మాత్రం కొంత ఉపయోగకరం అని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో 20 రోజులలో శివరాత్రి ఉండటంతో శివరాత్రి సమయానికి మామిడి కాయలు శివలింగం అంత గతంలో దర్శనం ఇస్తూ ఉండేవి. నేడు మాత్రం మామిడి తోటలు ఇంకా పూత దశలోనూ ఉండగా గత నాలుగు రోజుల నుండి పడుతున్న నీటి మంచుకి మార్పు చెంది పిందె దశకు చేరుకుంటున్నాయి. అయితే మామిడి రైతులు వేలాది రూపాయలు వెచ్చించి మందులను పిచికారి చేస్తున్నారు. గత 5 సంవత్సరాలుగా మామిడి కాపులో పురుగు రావడంతో మామిడి ప్రియులు కాయను తినేందుకు ఆశక్తి చూపడం లేదు. గత 4 రోజులుగా దివిసీమలో కురుస్తున్న నీటి మంచు వలన వాహనదారులకు ఇబ్బందులు కల్గించినప్పటికి మామిడి రైతాంగానికి మాత్రం మేలు చేకూరుస్తుందని మామిడి రైతులు అంటున్నారు.

# వేరు వేరు ప్రమాదాల్లో రెండు వరి కుప్పలు దగ్ధం





అవనిగడ్డ మేజర్ న్యూస్ : వేరు వేరు ప్రమాదాల్లో రెండు వరి కుప్పలు దగ్ధం అయిన సంఘటన నియోజకవర్గం ప్రధాన కేంద్రం అయిన అవనిగడ్డలో జరిగింది. మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో శనివారం రాత్రి వేకనూరు పంచాయితీ సెక్రటరీ రాజనాల శివ నాగ ఫణీంద్రకు చెందిన ఎకరం వరి పంట గల కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధం అయ్యింది. కుప్ప దగ్ధం అయిన పంట పోలాన్ని కొద్ది కాలంగా దేవాలయానికి ఇవ్వాలనే ఆలోచనలో శివ నాగ ఫణీంద్ర ఉండగా ఇటువంటి దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఫణీంద్ర కోరుతున్నారు. దేవుడికి ఇచ్చే పంట పోలంలో ఇటువంటి సంఘటన దుర్మార్గం అని గ్రామస్తులు ఆవేదన తెలుపుతున్నారు. అవనిగడ్డ నుండి అశ్వారావుపాలెం వెళ్ళే రహదారి ప్రక్కన అవనిగడ్డ 4 వ వార్డుకు చెందిన రాజనాల సత్యనారాయణకు చెందిన వరి కుప్ప దగ్ధం కాగా, విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది, స్టేషన్ ఫైర్ అధికారి సమక్షంలో మంటలను చుట్టు పక్కలకు ఎగబాగకుండా అదుపు చేశారు. 80 వేల రూపాయల విలువ చేసే పంట కుప్పలు 40 వేల రూపాయల ఆస్థిని ఫైర్ సిబ్బంది కాపాడగల్గినట్టు అధికారి పి.ఎస్.వి.వి ప్రసాద్ చెప్పారు.



## అంతర్ జిల్లాల ఖో-ఖో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుడివాడ, మేజర్ న్యూస్: సామర్ల కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 24 నుంచి 26వ తేదీవరకు జరగనున్న అంతర్ జిల్లాల ఖో – ఖో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్టు ఉమ్మడి జిల్లాల కృష్ణా ఖో – ఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మడకా ప్రసాద్, మద్దినేని సత్య ప్రసాద్ తెలిపారు. గుడివాడ పట్టణంలోని ఎస్పీఎస్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల ఎంపికను ఆదివారం నిర్వహించారు. ఈ ఎంపికలో 90మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు చెప్పారు. ఈ ఎంపికకు రాంబాబు, సుధీర్, అనురాధ, రాజకుమార్ నిర్వహణ కమిటీగా వ్యవహరించారు.

## అలరించిన భక్తి రంజని



గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ : స్థానిక నల్లచెరువు శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో 9వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల సందర్భంగా స్వరరాగసుధ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భక్తి రంజని ప్రేక్షకులను అలరించింది. గాయనీగాయకులు కె.వి. శాయిబాబా శర్మ, కృష్ణకుమారి, సాంబశివరావు తమ గాత్రధారణలో పలు భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై యం. రామకృష్ణ, డోలక్‌పై షణ్ముఖశర్మ వాయిద్య సహకారాన్ని అందించారు.






## ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహతీ స్వరసుధ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత కొల్లూరు వేణుగోపాలరావు, అరుణకుమారి దంపతులు, ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీగాయకులు పత్రి నిర్మల, వై. హేమమాలిని, సీహెచ్. ఉమాదేవి, యన్. లక్ష్మి, డాక్టర్ జె. ముకుందప్రియ, పి. కిరణ్మయి, బి. ప్రత్యుద్యుమ్న సత్యోద్భవి, జి. వీరయ్య, వి. మధుబాబు, డి.టి. శాయిబాబా, యస్. సాంబశివరావు, బి.యస్. పోతరాజు, ఎ. వీరరాఘవరావు, జి. శ్రీనివాసరావు లు తమ గాత్రధారణలో పలు సినీ, భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై పి. ప్రసాద్, యస్. వెంకట్, ప్యాడ్స్‌పై బి. యోగి లు వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా శ్రీమతి కాకుమాను శ్యామల గారి జ్ఞాపకార్థం సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు అరుణకుమారికి మెమెంటో అందించి శాలువాతో సత్కరించారు. పి. కుమారశేఖర్ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కె. మధన్‌మోహన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# డయేరియా మృతులు ప్రభుత్వ హత్యలే...



## కమీషనర్ , మేయర్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

## నగర జనసేన పార్టీ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్

**గుంటూరు, మేజర్ న్యూస్ :** నగరంలో కలుషిత నీరు తాగి డయేరియా బారినపడి మరణించిన నలుగురువి ప్రభుత్వ హత్యలే అని నగర జనసేన పార్టీ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. ఆదివారం డయేరియాతో మరణించిన గాజుల సూర్యనారాయణ మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని తాగునీరు కలుషితమవుతుందని ఎంతగా మొత్తుకుంటున్నా పాలకుల్లో కానీ అధికారుల్లో కానీ ఏమాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు గుక్కెడు రక్షిత మంచినీరు దుస్థితిలో నగరపాలక సంస్థ పనితీరు ఉండటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆందోళన కరంగా ఉన్నాయన్నారు. డయేరియా ఆనవాళ్లు ఎక్కడా లేవంటూ కమీషనర్, మేయర్ వ్యాఖ్యానించటం బాధ్యతారాహిత్యం అంటూ నేరేళ్ళ సురేష్ మండిపడ్డారు. జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ పదేళ్లు శాసనసభ్యుడిగా అధికారం ఇస్తే ముస్తఫా తన అసమర్ధతతో నియోజకవర్గాన్ని అట్టడుగుస్థాయికి తీసుకెళ్లాడని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేనైన తన మాట వినడం లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముస్తఫా డ్రామాలు మొదలుపెట్టాడని మండిపడ్డారు. కమల్ హాసన్ నటనలు ఆపి ఇప్పుడైనా ప్రజలకి సేవాలందించాలని ముస్తఫాకి హితవు పలికారు. డయేరియాతో మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆళ్ళ హరి కోరారు. డివిజన్ అధ్యక్షుడు గాజుల రమేష్, రెల్లి యువనేత సోమి ఉదయ్ కుమార్, బందెల నవీన్, పులిగడ్డ నాగేశ్వరరావు, కలగంటి త్రిపుర, ఆకుల ప్రసాద్, నండూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ రెడ్డితో చర్చించేందుకు సిద్ధం



**అమరావతి, మేజర్ న్యూస్ :**రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక, విధ్వంస పాలనపై సీఎంతో చర్చకు తాను సిద్ధం అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వందల కోట్లు ఖర్చు చేస్తూ....అధికార దుర్వినియోగంతో సిద్ధం అని సభలు పెడుతూ జగన్ చెబుతున్న అసత్యాల నిగ్గుతేల్చేందుకు తాను సిద్ధం అని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బూటకపు ప్రసంగాలు, తప్పుడు ప్రచారాలు కాదు...దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు జగన్ సిద్దమా? ఏ అంశం మీదైనా..ఎక్కడైనా, ఏ రోజైనా చర్చకు నేను సిద్దమే అని చంద్రబాబు అన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో...ఎవరి పాలన రాతియుగమో చర్చిద్దాం..చర్చకు వచ్చే దమ్ముందా జగన్ అంటూ సవాల్ చేశారు. 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్కఛాన్సే జగన్ కు చివరి ఛాన్స్ కానుందని అన్నారు. ఓటమిపై జగన్ కు స్పష్టత రావడంతో మళ్లీ ప్రజలను ఏమార్చడానికి పరదాలు కాస్తా పక్కకు జరిపి ఎన్నికల ముందు రోడ్డెక్కాడని చంద్రబాబు దుయ్యబట్టారు. రూ.10 ఇచ్చి రూ.100 దోచిన జగన్ సంక్షేమ గురించి చెప్పడమా? సహజ వనరుల దోపిడీతో, స్కాం కోసమే స్కీం పెట్టిన విధానాలతో అత్యంత ధనిక ముఖ్యమంత్రి గా మారిన జగన్....పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జగన్ పాలనలో ఏ మూలన చూసినా అభివృద్ధి కాదు...ఏ ఊరుకెళ్లినా జగన్ 5 ఏళ్ల విధ్వంసం పాలనతో నష్టపోయిన ప్రజలు కనిపిస్తున్నారని చంద్రబాబు అన్నారు. సిద్ధం అని సభలు పెడుతూ జగన్ నోటి వెంట అశుద్ధ పలుకులు పలికాడని చంద్రబాబు తీవ్రంగా మండి పడ్డారు. ఓటమి భయంతో 77 మంది ఎమ్మెల్యేలను బదిలీలు అంటూ జగన్ ఇప్పటికే మడతపెట్టాడని... మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలను 50 రోజుల్లో ఇక జనం మడత పెడతారని ఎద్దేవా చేశారు. అన్ని వర్గాలను మోసం చేసి...సామాజిక ద్రోహం చేసిన జగన్..సామాజిక న్యాయం అనే పదం పలికే అర్హతే లేదని అన్నారు. జగన్ చెప్పినట్లు రేపు ఎన్నికల్లో ప్రతి బాధిత కుటుంబం వైసీపీని ఓడించేందుకు స్టార్ క్యాంపెయినర్ కాబోతోందని అన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్.టి.సి, స్కూల్ బస్సుల్ని లాక్కొని జనాన్ని బలవంతంగా రాప్తాడు సభకు తరలించారు. సభ నిజంగా సక్సెస్ అయ్యి ఉంటే జగన్ రెడ్డి రౌడీ గ్యాంగ్ వార్తలు కవర్ చేసే మీడియా సిబ్బందిపై ఫ్రస్టేషన్ తో దాడులు ఎందుకు చేశారు అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్ కు 5 కోట్ల ప్రజలకు మధ్య యుద్ధం అని అన్నారు. టీడీపీ తెచ్చిన 120 సంక్షేమ పథకాలు రద్దు చేసిన జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి జనం కసితో ఉన్నారని అన్నారు. ఎస్.సి., ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయలు దారి మళ్లించిన జగన్ పై పేదలు యుద్ధానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగుదేశం పేరు, నా పేరు చెబితే దళితులకు ఇచ్చిన సబ్ ప్లాన్ నిధులు, ఇన్నోవా కార్లు, నిరుద్యోగ భృతి, 11 డిఎస్సీలతో ఇచ్చిన 1.50 లక్షల టీచర్ పోస్టులు, రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపు కుంకుమ, చంద్రన్న బీమా, పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, అమరావతి, 16 లక్షల కోట్ల పెట్టుబడులు, 10 లక్షల ఉద్యోగాలు గుర్తుకు వస్తాయి అని చంద్రబాబు గుర్తు చేశారు. మహిళల కోసం 22 పథకాలు తెచ్చిన పార్టీ టీడీపీ అన్నారు. జగన్ రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి శీను, ప్రభుత్వ టెర్రరిజం, క్విడ్ ప్రోకో, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియా గుర్తొస్తాయన్నారు. జగన్ పేరు చెపితే అధిక ధరలు, పన్నులు, ఛార్జీల పెంపు, అప్పులు, బాదుడు, మోసాలు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తొస్తాయని దుయ్యబట్టారు. మ్యానిఫెస్టోలో మద్య నిషేధం అని చెప్పి...తరువాత దాన్ని మద్య నియంత్రణ అని మార్చి..రూ. 1.50లక్షల కోట్ల మద్యం అమ్మిన జగన్ విశ్వసనీయత గురించి చెపితే జనం నమ్మాలా అని ప్రశ్నిచారు. 98 శాతం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు అని జగన్ చెపుతున్న మాటలు పూర్తిగా బూకటం అని....ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాధుడుతో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపడం నిజం అని అన్నారు. నిన్నటి వరకు పరదాల్లో తిరిగిన జగన్....9 సార్లు కరెంట్ చార్జీలు పెంచిన జగన్....పేదల గురించి ఎన్నికల సమయంలో మాయ మాటలు చెపుతున్నాడని ఎద్దేవా చేశారు. రైతు భరోసాలో జగన్ ఇచ్చింది రూ.37వేలు మాత్రమే. రైతు రుణమాఫీ ద్వారా ఒకే సారి మేం రూ.50 వేలు ఇచ్చింది వాస్తవం కాదా...ఎన్నికల సమయంతో మిగిలిన మొత్తం అందకుండా నాడు జగన్ కుట్రలు చేసింది నిజం కాదా అని చంద్రబాబు ప్రశ్నించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి, రైతుల సబ్సిడీల నిలిపివేసిన జగన్ కు అసలు రాయలసీమలో సభ పెట్టే అర్హతే లేదని అన్నారు. విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వ హయంలో అనేక అడ్డంకులు సవాళ్ళు అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో తీసుకువెళితే.... జగన్ తన విధ్వంస పాలనతో విభజన కంటే ఎక్కువ నష్టం చేశారని చంద్రబాబు అన్నారు. టీడీపీ హయాంలో 14 శాతం ఉండే వృద్ధిరేటు...ఈ ప్రభుత్వం వచ్చాక 10.93 శాతానికి పడిపోయిందని, వైసీపీ ప్రభుత్వ హయంలో వృద్ధి రేటు 4.06 శాతం తగ్గింది, టాక్స్ రూపంలో ప్రభుత్వానికి ఏడాదికి రూ.30 వేల కోట్లు ఆదాయానికి గండి పడిందన్నారు. విభజన జరిగినప్పుడు మనకంటే తెలంగాణ 35 శాతం అధికంగా తలసరి ఆదాయం ఉంటే...2014 తర్వాత ఏపీలో సుపరిపాలన ద్వారా వ్యత్యాసాన్ని 27.5 శాతానికి తగ్గించామని వివరించారు. ఇప్పుడు జగన్ నిర్వాకం వల్ల ఏపీ తలసరి ఆదాయం తెలంగాణతో పోల్చితే 44 శాతం తక్కువగా ఉందని, అభివృద్ధి లేక ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోవడమే దీనికి కారణం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో అక్రమ కేసులు, అధికార దుర్వినియోగం తప్ప జగన్ సాధించింది శూన్యం అని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేకే కేసులతో వేధిస్తున్నారని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాన్ పై తాజాగా కేసు పెట్టడాన్ని ఆయన ఈ సందర్భంగా ఖండిచారు. జగన్ కేసులు పెట్టినా....దాడులు చేసినా ప్రశ్నించే గళాలను అణిచివేయలేదని...ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని....తమ జీవితాలు నాశనం చేసిన ఫ్యాన్ రెక్కలు విరగొట్టడానికి జనంతో కసితో ఉన్నారని చంద్రబాబు నాయుడు అన్నారు.



## 26న అనంతపురంలో జరిగే కాంగ్రెస్ సభను విజయవంతం చేయండి

**మంగళగిరి,మేజర్ న్యూస్:** సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని కాంక్షిస్తూ అనంతపురంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రారంభించే కాంగ్రెస్ సభలను విజయవంతం చేయాలని ఏఐసీసీ కార్యదర్శి గార ఉషా నాయుడు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని నిడమర్రులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ కుర్రా పున్నారావు నివాస గృహములో ఆమె మీడియాతో మాట్లాడారు.పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల నాయకత్వంలో పార్టీ కార్యకర్తలను సమన్వయం పరచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం తీసుకొస్తామన్నారు.రాష్ట్రంలో టీడీపీ,వైఎస్ఆర్సీపీలు చేసిందేమీ లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కంతేటి జీవన్ సాగర్,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ జమీవుల్లా,పట్టణ మహిళా అధ్యక్షురాలు కూర్మాల రాధిక,నాయకులు బాదినేడి కిషోర్,ఏలే హేమ సుందరరావు, అమరా సుధాకర్,ఈమని శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి ఉషా నాయుడును జిల్లా పార్టీ ఓబీసీ చైర్మన్ కుర్రా పున్నారావు, శ్రీమతి సరోజినీ దంపతులు సత్కరించారు.

## కోడి పందాల స్థావరం పై దాడి

**తాడికొండ, మేజర్ న్యూస్ :** కోడి పందాల స్థావరం పై దాడి చేసి 13 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కంతేరు గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారం మేరకు గత రెండు రోజులుగా నిఘా ఉంచారు. తాడికొండ సీఐ ప్రభాకర్ తన బృందంతో కలిసి ఆదివారం సాయంత్రం స్థావరం పై దాడి చేసి కోడి పందాలు వేస్తున్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటుగా 2కోళ్లు, రూ.20,700 నగదు, ద్విచక్రవాహనా లు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలం నందు కోడి పందాలు ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

## జయహో బీసీకి సంఘీభావంగా కాగడాల ర్యాలీ



**తాడికొండ మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ గ్రామంలో జరుగుతున్న జయహో బిసి కార్యక్రమానికి సంఘీభావంగా రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రెటరీ బండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రాజధాని దీక్ష శిబిరం నుండి చింత చెట్టు సెంటర్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహితను ఆశీర్వదించిన పలువురు ప్రముఖులు



**నందిగామ, ఫిబ్రవరి 18, మేజర్ న్యూస్:** పట్టణంలోని ప్రముఖ వేత్త, కమ్మ సంఘం నాయకులు నర్వనేని మురళి మనవరాలు అన్న ప్రాసన వేడుక ఘనంగా నిర్వహించారు. వియ్యంకులు వేమూరి శివాజీ స్వగృహం వద్ద ఏర్పాట్లను తెలుగు తనం ఉట్టి పడేలా ఏర్పాటు చేశారు. వేదికపై నవీన్, వినిత దంపతుల ను వారి కుమార్తెను పలువురు ఆశీర్వదించారు. మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వివిధ రాజకీయ పార్టీల రాష్ట్ర నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొని మహితను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, పట్టణ ప్రముఖులు, నర్వనేని మురళి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజ సద్భావనకు ప్రతీక అంబేద్కర్

## ఎమ్మెల్సీ లేళ్ల అప్పి రెడ్డి వెల్లడి




**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** సామాజిక న్యాయ మహా శిల్పంగా విజయవాడ నడిబొడ్డున ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు పిలుపునిచ్చారు. మనుషులంతా ఒక్కటే అనేందుకు అది చక్కని నిదర్శనంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు క్లస్టర్ – 2 అధ్యక్షుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పలకలూరు నుంచి “సమసమాజ సద్భావనకు ప్రతీకగా.. సామాజిక సాధికారత చిహ్నంగా.. ముఖ్యమంత్రి వైయస్ జగన్ విజయవాడలో ఆవిష్కరించిన 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం సందర్శన యాత్ర – 2” ప్రారంభమైంది. గుంటూరు రూరల్ ఎంపీపీ ఇంటూరి పద్మజ అంజిరెడ్డి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఆళ్ళ రవి దేవరాజు, వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర నేత పోలూరి వెంకటరెడ్డి, నవ్యాంధ్ర యమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు హేమ ప్రసాద్ తదితరులు మొత్తం 10 బస్సులకు జెండా ఊపి లాంఛనంగా యాత్ర–2కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ, ప్రపంచం గర్వించదగ్గ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గొప్ప దార్శనికుడే కాక సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు తన జీవిత చరమాంకం వరకు కృషి చేసిన అందరివాడని కీర్తించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్, భావితరాలలో సైతం ఆ స్ఫూర్తిని నింపేందుకే దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టి గొప్ప చరిత్ర సృష్టించారని వెల్లడించారు. అంతరాలు లేని అందమైన సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ నాడు ఎటువంటి కృషి చేశారో... నేడు అదే రీతిలో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి లానే జగన్ కూడా అంబేద్కర్ సిద్ధాంతాల నుండి స్ఫూర్తి పొంది తనదైన శైలిలో పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. వినూత్నంగా అప్పిరెడ్డి – అంబేద్కర్ యాత్రకు శ్రీకారం చుట్టి దశల వారీగా ప్రజలను అంబేద్కర్ విగ్రహ సందర్శనార్థం తన సొంత ఖర్చులతో తీసుకెళ్తున్న నూనె ఉమామహేశ్వరరెడ్డి దార్శనికతను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ స్మిత పద్మజ, నల్లపాడు పార్టీ అధ్యక్షుడు యోగేశ్వరరెడ్డి, పలకలూరు పార్టీ నేతలు జానీ, రామకోటేశ్వరరావు, మరియబాబు, గోపి, మురళి, హుస్సేన్ షా తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ పాఠశాలలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్









**నందిగామ, ఫిబ్రవరి 18, మేజర్ న్యూస్:** పట్టణంలోని రైతు పేట కాకతీయ–అపోలో విద్యాసంస్థలలో గ్రాండ్ పేరెంట్స్ డే, మాతృ వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం ముఖ్య అతిథిగా విజయవాడ ప్రముఖ న్యాయవాది హజరత్తయ్య గుప్తా, మాతృ వందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శాంతి పాల్గొన్నారు. స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు, బహుమతులను వారి వారి అమ్మమ్మ నాయన,మ్మ తాతయ్యల చేతుల మీదుగా అందజేశారు. దీనితో వారందరి ముఖాలలో ఆనంద భాష్పాలు వెల్లువిరిచినాయి. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, మానవతా విలువలు మరుగున పడుతున్న ఈ తరుణంలో, మా విద్యార్థుల్లో వాటిని పెంపొందించుటకు మేము గత 8 సంవత్సరాలుగా, ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మాకు, మా విద్యార్థుల తల్లిదండ్రులకు, చాలా సంతోషదాయకంగా ఉందన్నారు. ముఖ్యఅతిథి హజరత్ గుప్తా మాట్లాడుతూ విద్యార్థులతో నేరుగా ఇంట్రాక్ట్ అయ్యి, అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల, ఆధ్వర్యంలో ఉన్న, ఉండిచదువుకున్న మధ్య అంతరాలను చాలా చక్కగా వివరించారు. ముఖ్య అతిథి శాంతి మాట్లాడుతూ, అమ్మ యొక్క గొప్పతనాన్ని, బ్రహ్మ ఈ సృష్టిని నిర్మిస్తే ఆ బ్రహ్మను కూడా ఒక అమ్మ సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల డాన్సులు, అవ్వ తాతల అమ్మలపై ప్రదర్శించిన లఘు నాటికలు, అందర్నీ అలరించాయి. చివరిగా విద్యార్థిని విద్యార్థులు, వారి వారి తల్లుల పాదాలను కడిగి, నమస్కరించి, వాటిని వారి తలలపై పోసుకొని, స్వీట్స్ ని షేర్ చేసుకొని, వారి ఆశీర్వచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ఎక్సలెంట్ సీబీఎస్సీ డైరెక్టర్ కాపా కార్తికేయ, లయన్ రామిరెడ్డి శ్రీధర్, ప్రముఖ పాత్రికేయులు ఘంటా విజయ్ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## 9వ డివిజన్‌లో సీసీ రోడ్లు పనులను పరిశీలించిన నగర మేయర్

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** స్థానిక 9వ డివిజన్‌లో గడప గడప నిధులతో వేస్తున్న సీసీ రోడ్ పనులను నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు పూర్తి చేయాలి అని కాంట్రాక్టర్ కి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మిరియాల బసవపూర్ణమ్మ, 9వ డివజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణి శ్రీ, కాంట్రాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

# మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరులో డయేరియా ప్రబలి చాలా మంది ప్రజలు ఆసుపత్రి పాలయ్యి, ఇప్పటికి లెక్కలోకి రాకా చనిపోయిన ప్రజలు అనేకమంది ఉన్న కూడా ఈ వైసీపీ ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్నట్లు నటిస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర (నానీ) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గుంటూరు నగరంలో డయేరియా ప్రబలి ప్రజలు చనిపోయారని,దీని మీద గట్టి చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తమని అవహేళన చేశారని, అసలు ఇది డయేరియా కాదని వాదించిన ఆమె ఈ రోజు శ్రీనగర్ కాలనిలో కూడా గాజుల సూర్య నారాయణ అనే వ్యక్తి చనిపోయాడని, అనేకమంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్న విషయం మంత్రి తెలుసుకోవాలన్నారు. ఈ విషయాల పై మీరు దాచాలని ప్రయత్నించటం అవివేకమన్నారు. ఇప్పటికయిన నగర పాలక సంస్థ అధికారులు మేల్కొని నీటి పరీక్షలు నిర్వహించి, ప్రజల ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## శంఖారావం సభలో యువనేత లోకేష్‌తో పులి చిన్న



**తుళ్లూరు మేజర్ న్యూస్:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో అమరావతి దళిత జేఏసీ నాయకుడు తెలుగుదేశం పార్టీ తాడికొండ నియోజకవర్గ నాయకులు పులి చిన్న మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం విశాఖపట్నంలో శంఖారావం సభలో లోకేష్‌ను కలిసి నారా లోకేష్ జన్మదిన పురస్కరించుకొని కృష్ణా నదిలో ఏర్పాటు చేసిన 100 అడుగుల కటౌట్ చిత్రాన్ని ఫోటో ఫ్రేమ్ రూపంలో బంధించి ఆయనకు అందజేసినట్లు పులిచిన్న వెల్లడించారు దీంతోపాటు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తమ పేరును కూడా పరిశీలించాలని నారా లోకేష్ ను కోరినట్లు పులిచిన్న తెలిపారు. తన బయోడేటాను లోకేష్ కు అందజేశామని వివరించారు.

## బలోపేత ఉద్యమాలే జీవితాలకి మెరుగు...




**మంగళగిరి,మేజర్ న్యూస్:** హక్కుల ఉద్యమాన్ని బలోపేతం చేయటం ద్వారానే ప్రజలు తమ జీవితాలను మెరుగు పరచు కోగలగుతారని పౌరహక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా 20వ మహాసభల్లో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు అభిప్రాయపడ్డారు. మంగళగిరి నగరంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సిపిఐ కార్యాలయంలో ఈ మహాసభలు ఆదివారం నిర్వహించారు. ఈ సభకు సంఘం అధ్యక్షులు డాక్టర్ వీరేశలింగం అధ్యక్షత వహించారు. అధిపత్యశక్తులు,ప్రభుత్వ అణచివేత చర్యల నుండి అణచివేతకు గురియిన వారు ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలు యువతప్రభావం అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుబాబు ఉపన్యాసించారు. ఈ సభలో మంజుశ్రీ, షేక్ నాగర్ వలి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు,జిల్లా ఉపాధ్యక్షులుప్రభాకర్, నరసింహారావు, పేరయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకాచంద్రశేఖర్,రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రాజారావు,రాష్ట్ర కమిటీ సభ్యులు రాజారావు పాల్గొన్నారు.

## వైవీ.సుబ్బారెడ్డిని సత్కరించిన మేయర్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, టీటీడీ మాజీ చైర్మన్ వై.వి సుబ్బా రెడ్డిని గుంటూరు నగర మేయర్ కావటి శివనాగు మనోహర్ నాయుడు ఆదివారం సత్కరించారు. వై.వి సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యులుగా నామినేట్ అయిన సందర్భంగా తాడేపల్లిలోని ఆయన నివాసం వద్ద కలిసి శాలువా,బోకేతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వై.వి సుబ్బారెడ్డి భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాక్షించారు.

## గవర్నర్‌కి ఘన స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ కి ఘన స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల యొక్క సిల్వర్ జూబ్లీ వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ కి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ పర్యటన సందర్భంగా సభా ప్రాంగణంలో, కాన్వాయ్ రూట్ లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసి గవర్నర్ పర్యటనను విజయవంతం చేయడం జరిగింది. ఈ పర్యటనను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని, పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.